క్లుప్తంగా

66 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అడ్డతీగల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో 66 మంది గర్భిణులకు డాక్టర్ జగదాంబ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి పండా సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సెలర్ నారే వాసు, హెడ్ సిస్టర్ దేవుడు,నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరా ప్రారంభం



రాజవొమ్మంగిలో పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించిన అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని 98 పాఠశాలలకు మంగళవారం తొలివిడతగా 6వ తరగతి నుంచి పదవ తరగతికి వరకూ 17,401 పాఠ్య పుస్తకాలను సరఫరా చేసినట్టు ఎంఈవో -1 సత్యనారాయణ దొర, ఎంఈవో-2 సూరయ్యరెడ్డి తెలిపారు. 28,646 నోట్ పుస్తకాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మంగరాజు, విష్ణు, ఆది, సతీష్, శ్రీను ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది సుజాత, ఉష, ఏసుబాబు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ పూర్తి

గూడెంకొత్తవీధి: దోమల నివారణకు ఏసీఎం ఐదు శాతం మందు మొదటి విడత పిచికారీ పూర్తయినట్టు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.కన్నబాబు తెలిపారు.ఆయన మంగళవారం అసరాడలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం ఏడు పీహెచ్‌సీల పరిధిలో 131 గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేసినట్టు చెప్పారు. ఏప్రిల్ 15న ప్రారంభించి 50 రోజుల పాటు నిర్వహించామని తెలిపారు. సుపీరియర్ ఫీల్డ్ వర్కర్ అచ్యుత్ ,హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆశా వర్కర్లు దీన కుమారి,రాజేశ్వరి, డ్వాక్రా వీవో కుసుమ పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



నాగయ్యపేటలో మొక్కలు నాటుతున్న త్రినాథరాజు తదితరులు

దేవరాపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షించాలని ఆదర్శ వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు బి.త్రినాథరాజు అన్నారు. మండలంలోని నాగయ్యపేట గ్రామంలో పర్యావరణ పర్యావరణ వారోత్సవాలను పురస్కరించుకొని వనం-మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక డ్వాక్రా మహిళలతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జామి ఉమా మంగబాబు, జామి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాలు



లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


నాతవరం: ఇందిరమ్మ మోడల్ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో మంగళవారం ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఉచితంగా తీర్థ పసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలతో భజనలు, కోలాటం ఏర్పాటు చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మునగపాక:అరబుపాలెం సీతారామ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు మంగళవారం నిర్వహించారు. శ్రీరామ నవమి పండగ తర్వాత నుంచి ఇంతవరకు హుండీ ద్వారా భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.19,512 ఆదాయం వచ్చినట్టు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బొడ్డేడ వెంకట సతీష్, అర్చకులు నాని పంతులు, గోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ నిర్లక్ష్యం... కేజ్ కల్చర్‌కు శాపం

మత్స్యకారులకు మేలు చేస్తామంటూ గతంలో టీడీపీ ప్రభుత్వం గొప్పగా కేజ్‌కల్చర్ ప్రాజెక్టును ప్రారంభించింది.. వారిలో ఆశలు రేపింది.. అకస్మాత్తుగా ఆ ప్రాజెక్టును మధ్యలో నిలిపివేసి లబ్ధిదారుల ఆశలపై నీళ్లు జల్లింది.. చివరకు ఆశావహులను పథకానికి దూరం చేసి, ఉపాధికి గండి కొట్టింది.. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన పరికరాలు నీళ్లపాలయ్యాయి.



నాటు పడవలపై చేపల వేట చేస్తున్న గిరి మత్స్యకారులు

- మత్స్యకారుల ఆశలపై నీళ్లు



సుజనకోట మత్స్యగెడ్డలో మధ్యలో నిలిచిన కేజ్ కల్చర్ పనులు

ముంచంగిపుట్టు: జిల్లా మత్స్య శాఖ అధికారులు 2017 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.14.50 లక్షల వ్యయంతో ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీ కేంద్రం సమీపంలోని మత్స్యగెడ్డలో కేజ్ కల్చర్ ఏర్పాటు చేసేందుకు సంకల్పించారు. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది మత్స్యగెడ్డలో చేపల పెంపకానికి అవసరమైన ఫైబర్ పంజరాలు ఏర్పాటు చేశారు. కేరళ రాష్ట్రం కొచ్చికి తీసుకువెళ్లి ముగ్గురు మత్స్య కారులకు మూడు నెలల పాటు కేజ్ కల్చర్ నిర్వహణపై శిక్షణ ఇప్పించారు. అయితే ఎందుకో పనులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. దీంతో కేజ్ కల్చర్ ద్వారా తమకు ఆర్థిక ఆసరా దొరుకుతుందనుకున్న మత్స్యగెడ్డ పరీవాహక ప్రాంత మత్స్యకారులకు నిరాశే మిగిలింది. అసంపూర్తిగా వదిలేసిన పనులకు సంబంధించి అప్పటి ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవోల దృష్టికి స్థానిక మత్స్యకారులు తీసుకెళ్లినా హామీలతో కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకొన్న కేజ్ కల్చర్ నిరాశ మిగిల్చినట్టయింది.

కేజ్ కల్చర్‌తో ఎక్కువ లాభం

గెడ్డలోని అన్ని చేపలకు మేత వేయడం కష్టంతో కూడుకున్న పని. కేజ్ కల్చర్‌లో పంజరం లాంటి నిర్మాణాల్లో చేపలను పెంచడం చాలా సులువు. చేపలకు ప్రత్యేక ఆహారం అందించేందుకు అవకాశం ఉంటుంది. చేపలు వ్యాధులకు గురైతే గుర్తించి నివారణ చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. దీంతో చేపలు ఆరోగ్యంగా అధిక బరువుగా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. గెడ్డలో దొరికే చేపల కంటే పంజరంలో పెంచిన చేపలు నాణ్యతగా, మంచి రుచిగా ఉంటాయి. అవసరమైనప్పుడు చేపలను పట్టుకోవచ్చు. ఈ విధంగా అన్ని విధాలా మత్స్యకారులకు లబ్ధి చేకూరుతుంది. దీంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయి.

నాటు పడవలపై చేపల వేట

మండలంలో మత్స్యగెడ్డ పరీవాహక గిరి మత్స్యకారులు నాటు పడవలపై చేపల వేట సాగిస్తున్నారు. ఉదయం వలలు వేసి సాయంత్రం వరకు ఉంచి తీసినా చేపలు అంతగా చిక్కడం లేదు. దీంతో చేపల వేటే వృత్తిగా జీవనం సాగిస్తున్న గిరిజనులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం కేజ్ కల్చర్ ఏర్పాటు చేస్తుందని ఆశ పడ్డామని మధ్యలోనే ప్రాజెక్టు నిలిచి పోవడంతో నిరాశ చెందామని మత్స్యకారులు వాపోయారు.



గతంలో కొనుగోలు చేసిన సామగ్రి

కేజ్ కల్చర్‌ను పూర్తి చేయాలి



కేజ్ కల్చర్ నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేయడంతో నిరాశ చెందాం. చేపల వేటపైనే బతుకుతున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉపాధి లభిస్తుంది. మత్స్యశాఖ అధికారులు చొరవ తీసుకుని మధ్యలో నిలిచిపోయిన కేజ్ కల్చర్ పనులు పూర్తి చేయాలి

– వి. నరేష్, గిరి మత్స్యకారుడు, సుజనకోట , ముంచంగిపుట్టు మండలం

మూడు నెలలు శిక్షణ పొందాను



కేజ్ కల్చర్ నిర్వహణపై కొచ్చిలో మూడు నెలల పాటు శిక్షణ తీసుకొన్నాను. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఆర్థిక ఆసరా దొరుకుతుంది. గతంలో కేజ్ కల్చర్‌ను పూర్తి చేయాలని అధికారులకు విన్నవించాం. కానీ సరైన సమాధానం రాలేదు. మత్స్యశాఖ అధికారులు కేజ్ కల్చర్‌పై చొరవ చూపాలి.

– బి.లక్ష్మణ్, మత్స్యకారుడు, గొడుగులపుట్టు, ముంచంగిపుట్టు మండలం

ప్రతిపాదనలు పంపాం

కేజ్ కల్చర్ ఏర్పాటు మధ్యలోనే నిలిచిపోవడంతో కొన్ని నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. మళ్లీ నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. నిధులు మంజూరు కాగానే కేజ్ కల్చర్ వినియోగంలోకి వస్తుంది.

– పి.లీలాప్రసాద్, విలేజ్ మత్స్యశాఖ అసిస్టెంట్, సుజనకోట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం.

ఘనంగా షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం



సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

గంగవరం: పాత గంగవరం రామాలయంలో గల షిర్డీ సాయిబాబా మందిర తృతీయ వార్షికోత్సవాన్ని మంగళవారం కొమ్మన చిన్నారావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సాయి, రామాలయ అర్చకులు వై.ఆర్.కె ప్రసాద్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సత్యనారాయణమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, గిరిజన వర్ధిక సంస్థడైరెక్టర్ కె.చిన్నారావు, గిరిజన జేఏసీ నాయకుడు కె.సిద్ధు, ఉపాధ్యాయులు ఎస్.పాపన్న దొర, నాగమణి, రామాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, పాత గంగవరం యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు



ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న యువకులు

మెంటాడ (విజయనగరం జిల్లా): సాలూరు నుంచి మెంటాడ వైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు బిరసాడవలస వద్ద ప్రమాదానికి గురయ్యారు. బైక్ స్కిడ్ కావడంతో రోడ్డుపై బోల్తా కొట్టారు. ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితికి చేరుకున్నారు. యువకులు ఇద్దరిదీ అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ గూడెం గ్రామంగా పోలీసులు గుర్తించారు. వీరిని చికిత్స కోసం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.సీతారాం పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

గౌరవం లేదు.. వేతనం రాదు

- అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామంటూ ఎంపీటీసీల ఆవేదన
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమస్యలను వివరిస్తున్న ఎంపీటీసీ దేవి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

ఎటపాక: ప్రజాప్రతినిధులమైన తమకు గౌరవం లేదు.. గౌరవ వేతనంరావడం లేదంటూ ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన ఎటపాక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ప్రారంభం నుంచి వాడీవేడిగా సాగింది. అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీటీసీలకు నిధులు కేటాయించినట్టు చెప్పడమే కానీ ఇప్పటి వరకు పనులు చేసేందుకు ఎటువంటి కార్యాచరణ లేదని, కొందరు చేసిన పనులకు కూడా బిల్లులు మంజూరు కావట్లేదని వాపోయారు. గౌరవవేతనం కూడావిడుదల చేయలేదని, ఎప్పుడు తమ వేతనాలు ఇస్తారంటూ ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌ను ప్రశ్నించారు.మరో ఏడాదిలో పదవీకాలం ముగుస్తుందని అప్పటివరకు ప్రజలు అడిగే ప్రశ్నలకు తాము ఏం జవాబు చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏనాడు సక్రమంగా విధులకు రాని గౌరిదేవిపేట పశువైద్యాధికారికి మంచిగా విధులు నిర్వర్తిస్తున్నారంటూ ఎలా సర్టిఫికెట్ ఇచ్చారని ఎంపీపీని వైస్‌ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ప్రశ్నించారు. గోదావరి వరదలు రాకముందే లోతట్టు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు తొలగించి కొత్త లైన్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ ఏఈని ఆయన కోరారు.మండల కేంద్రంలో జరిగే ఏ కార్యక్రమానికి తమకు సమాచారం ఇవ్వడంలేదంటూ ఐసీడీఎస్ అధికారుల తీరుపై జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులకు ఎటపాక పంచాయతీ కార్యదర్శి కనీస గౌరవం కూడా ఇవ్వడంలేదని, ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం పెడుతున్నామని ఎంఈవో రాజులు తెలిపారు. ఆసమయంలో అధికార పార్టీ ఎంపీటీసీలు చప్పట్లు కొట్టడంతో తల్లికి వందనం పథకాన్ని చెప్పిన విధంగా అమలుచేస్తారా అంటూ ప్రతిపక్ష ఎంపీటీసీ అంజలి ప్రశ్నించారు. ఆ సమయంలో ఇరు వర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. గోదావరి వరదల సమయంలో రహదారి సౌకర్యంలేని అన్ని గ్రామాల ప్రజలకు జీవనభృతి ఇచ్చేలా ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వాలంటూ గన్నవరం ఉపసర్పంచ్ కందుకూరి స్వర్ణ.. తహసీల్దార్ సుబ్బారావును కోరారు.

బాలికల ఉన్నతికి కృషి చేయాలి



దుంబ్రిగుడలో జాతీయ రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, బాలికలు



మానవహారం నిర్వహిస్తున్న బాలికలు



క్రీడా పోటీల విజేతలను సన్మానిస్తున్న సీడీపీవో లక్ష్మి



రింతాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు

దుంబ్రిగుడ: బాలికలు ఉన్నత స్థాయికి ఎదిగేలా అందరూ కృషి చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ అన్నారు. ఐసీడీవో సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం అనంతరం ర్యాలీ, జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి, కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. బెలూన్లు ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల పట్ల అసమానతలు వదిలి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: బాల్య వివాహాలను అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీవో లక్ష్మీదేవి తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.ఈ సందర్భంగా రింతాడ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మీదేవి మాట్లాడుతూ 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు అతిపెద్ద శాపంగా మారాయన్నారు.వాటి నిరోధానికి అంతా కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధానికి ప్రతిజ్ఞ చేయించారు.

లక్కొండలో...

గంగవరం : కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా లక్కొండ గ్రామంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలన, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. లక్కొండ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి విజయ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంగవరం సీడీపీవో సీహెచ్.లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకున్న చెదల మౌనిక, లొల్లోడి లక్ష్మి ప్రసన్న, కొండపల్లి లాస్యలను ఈ సందర్భంగా సన్మానించారు. పీసా కార్యదర్శి కారు చిన్నయ్య, సూపర్‌వైజర్ టి.సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్త పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చింతపల్లి: పౌష్టికాహారం తీసుకోవడంద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమం ముగింపు సందర్భంగా చింతపల్లిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సీడీ పీవో జి.వి.రమణ రమ జి,ఏసీడీపీవో రామలక్ష్మి,సూపర్‌వైజర్లు విజయ కుమారి,గౌహర్‌ఉన్నీషా,అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

- పలు ప్రాంతాల్లో కోతకు గురైన ఆర్‌అండ్ బీ రహదారులు
- పట్టించుకోని అధికారులు



కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

పెదబయలు: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణం నరకంగా మారింది. పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు, బంగారుమెట్ట నుంచి గోమంగి మీదుగా జి.మాడుగుల వెళ్లే రింగ్‌రోడ్డు పలు ప్రాంతాల్లో కోతకు గురయ్యాయి. లక్ష్మీపురం-చంపాపుట్టు గ్రామాల మధ్యలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్డుపై నిత్యం నీరు ప్రవహిస్తుండడం వల్ల కోతకు గురవుతోంది.ఈ ప్రాంతంలో పెద్ద వాహనాలు,ఆర్టీసీ బస్సు వెళితే తప్పించుకుని వెళ్లడం ఇబ్బందిగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు పలు మార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇటీవల ఈ ప్రాంతంలో మూడు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. పన్నెడ,ముసిడిపుట్టు గ్రామాల మధ్యలో రోడ్డు కోతకు గురైంది. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించడం లేదు

లక్ష్మీపురం సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక ఏడాది నుంచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదు. కనీసం రోడ్డు కోతకు గురైన చోట హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.ప్రమాదాల జరుగుతున్నా అధికారులు ఇంతా నిర్లక్ష్యంగా ఉండడం బాధాకరం.

– చెండా రవిశంకర్, సర్పంచ్, పర్రెడ పంచాయతీ, పెదబయలు మండలం

మరమ్మతులు చేపడతాం

లక్ష్మీపురం గ్రామ సమీపంలో రోడ్డు కోతకు గురైన విషయం తెలియదు. వెంటనే పరిశీలించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేస్తాం. ఎన్ఆర్‌జీఎస్ పథకంలో బంగారుమెట్ట నుంచి చిత్రాయిపుట్టు వరకు రోడ్డు విస్తరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతి వస్తే పనులు ప్రారంభిస్తాం. దశల వారీగా అన్ని పనులు పూర్తి చేస్తాం.

– శ్రీదేవి,ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ పాడేరు.

ఈదురుగాలులతో వర్షం



సత్యవరంలో కురుస్తున్న వర్షం

మాడుగుల : మండలంలో సత్యవరం, తాటిపర్తి, అవురువాడ గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు, గాలులకు సుమారు 300 ఎకరాల్లో అపరాలు సాగు దెబ్బతిన్నాయి. ఒక వైపు ఖరీఫ్ సీజన్ రావడంతో వరి నారు మడులు సిద్ధం చేసుకోలేకపోతున్నామని, పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోలేక పోతున్నామని, పలు గ్రామాలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

మాడుగుల రూరల్: మృగశిర కార్తె ప్రవేశంతో మంగళవారం ఉదయం నుంచి ఆడపా దడపా వర్షం కురుస్తుంది. దీంతో వాతావరణం చల్లబడింది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రావికమతం: మేజర్ పంచాయతీ కొత్తకోటలో పారిశుధ్యం మెరుగు పర్చే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సుమారు 15 వేల పైబడి జనాభా, 16 వార్డులతో కొత్తకోట విస్తరించి ఉంది. శనివారం వారపు సంత, రోజు వారి మార్కెట్‌తో పాటు విస్తరాకుల తయారీ వ్యర్థాలతో రోజూ టన్నుల కొద్దీ చెత్త పోగవుతుంది. పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా , ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డి ప్రణాళిక సిద్ధం చేసి మంగళవారం పనులు ప్రారంభించారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో హోమాలు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నెల 31 వ తేది నుంచి జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవాలు బుధవారంతో ముగియనున్నట్టు ఆలయ ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నాగవల్లి సంబరాలు పురస్కరించుకుని, ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి, రాత్రి 7 గంటల నుంచి స్వామి వారి పుష్పంజలి సేవ, దర్పణ దర్శనం, పవళింపు సేవ, జరుగుతుందని, భక్తులు సహకారంతో చద్ది ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేంగా హోమాది కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ అభివృద్ధి పనులు

మునగపాక: స్థానిక కృష్ణంరాజు కాలువలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. 15 సంవత్సరాలుగా కాలువలో పేరుకుపోయిన తుప్పలు, సిల్టు కారణంగా సాగునీటి ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం కాలువలో మిషన్ సహాయంతో తుప్పల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఈ కాలువపై ఆధారపడి సాగు చేపట్టే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సంబంధిత పనులను కాలువ సంఘ అధ్యక్షుడు పెంటకోట రాము, ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీరామమూర్తి, డైరెక్టర్లు పచ్చికూర నరసింగరావు, వేగి పరదేశినాయుడు, సంఘ మాజీ అధ్యక్షుడు భీమిశెట్టి గణేష్‌నాయుడు తదితరులు పరిశీలించారు. పనులు వేగవంతం చేసి పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపడతామన్నారు.